క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ సందర్శన



చిల్పూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీం శర్మ సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో ఎవరినైనా ఇబ్బంది పెట్టేలా పోస్టులు పెడితే గ్రూపు అడ్మిన్‌తో పాటు పెట్టినవారిని, ఫార్వర్డ్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా ఊరికి వెళ్తే పక్కింటి వారికి లేదా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని చెప్పారు. జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



పాలకుర్తి: వావిలాల గ్రామానికి చెందిన దొంగరి అశోక్ ఇటీవల మృతి చెందాడు. కాగా శుక్రవారం ఆయన దశదిన కర్మలో ప్రగతి విద్యాలయం మిత్రులు బాధిత కుటుంబానికి రూ.25వేల సాయం అందజేశారు. దొంగరి మహేందర్, గొల్లపల్లి గణేష్, రవి కుమార్, శివ కుమార్, మహేష్, చిత్తరంజన్ ఉన్నారు.

'తెలంగాణలో బీజేపీ పాలన అనివార్యం'

దేవరుప్పుల/పాలకుర్తి/చిల్పూరు: తెలంగాణ శాశ్వత ప్రాతిపదికన సమగ్రాభివృద్ధి కోసం వచ్చే అసెంబ్లీ ఎన్నికల ద్వారా బీజేపీ పాలన అనివార్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు పురస్కరించుకుని మండల అధ్యక్షుడు పెద్దగొని రాజు ఆధ్వర్యంలో గావ్ చలో/బస్తీ చలోలో భాగంగా పెద్దమడుర్‌లో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను బీజేపీ మండల నాయకులు సందర్శించారు. అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం, స్త్రీ,శిశు సంక్షేమంతోపాటు పల్లెల సమగ్రాభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ నిధులను ప్రజలకు వివరించారు. అనంతరం జనసంఘ్ నుంచి పార్టీకి సేవలు అందిస్తున్న సీనియర్ నాయకుడు బొరేం కొండల్ రెడ్డిని సన్మానించారు. బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కాసాని సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు కారు పోతుల అశోక్ గౌడ్,యువమోర్చా నాయకుడు సంగి రాజు,సందీప్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే గావ్ చలో/బస్తీ చలోలో భాగంగా పాలకుర్తిలోని పురాతన శివాలయంలో నాయకులు పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. నాయకులు లేగ రామోహన్‌రెడ్డి, చింత సృజన్, కదుదుల నిరంజన్‌రెడ్డి, కమ్మగాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. చిల్పూరు మండలంలోని నష్కల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ పాల్గొని మాట్లాడారు. కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని అన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ బాణాపురం కాలనీ వద్ద నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో అండర్ పాస్ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలెక్టరేట్‌లో కలిసి విన్నవించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ వేమల్ల సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ కంచ రాములు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం



జనగామ: జిల్లా కేంద్రం హెడ్ పోస్టాఫీస్ ఏరియాలోని సంతోషిమాత ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు శుక్రవారం రెండో రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు.

ఎన్నిక

జఫర్‌గఢ్: తీగారం గ్రామ శివారు హనుమాన్ తండాకు చెందిన యాకన్న రాథోడ్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ 8వ మహాసభలో సంఘం జిల్లా నూతన కార్యవర్గంతో పాటు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా యాకన్న రాథోడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం యాకన్న మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నేలవాలిన మొక్కజొన్న

● రైతుల ఆందోళన



రామచంద్రాపురంలో నేలవాలిన మొక్కజొన్న పైరు

దేవరుప్పుల: వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నయ పంటల సాగు చేసే రైతులకు గాలిదుమారంతో కూడిన అకాల వర్షంతో చేతికొచ్చే వేళ మొక్కజొన్న పంట నేలవాలిన సంఘటన గురువారం రాత్రి రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. కోలుకొండ రెవెన్యూ పరిధి రామచంద్రాపురంతోపాటు పాలకుర్తి మండలం శాతాపురం రైతులు గుట్టల ఏరియాలో ఉన్న నీటి వసతిపై ఆధారపడి 200 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. మరో పది రోజుల్లో పంట దిగుమతి వస్తుందన్న రైతుల ఆశలకు అకాల వర్షం శాపంగా మారిందని వాపోతున్నారు. సాయంత్రం నుంచే గాలిదుమారం రావడంతోపాటు వర్షపు జల్లులతో మొక్కజొన్న కర్రలు నేలవాలి విరిగిపోయాయి. శుక్రవారం తెల్లారి రైతులు నష్టపోయిన పంటలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఖరీఫ్‌లో పత్తి, పొగాకు వేసే రైతులు రబీలో మొక్కజొన్న వేసి లాభసాటిలో కొనసాగుతున్న క్రమంలో ప్రకృతి తాండవంతో నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సమాచరం అందుకున్న ఆ ఏరియా వ్యవసాయ విస్తరణాధికారి మహాలీన్ సన పంట చేలకు చేరుకుని సర్వే చేసి సుమారు 100 ఎకరాల పైచిలుకు మొక్కజొన్న పంట నష్టం వాటిల్లినట్టు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి



నల్ల రేగడి భూములు కావడంతో ఉన్న బోరు నీటి సౌకర్యంతో ఎకరానికి రెక్కల కష్టం కలిపి రూ.30 వేల పెట్టుబడి అయింది. మరో 15 రోజుల్లో పంట కోస్తే లాభం వస్తుందనుకునే క్రమంలో గాలిదుమారం వర్షంతో రెండున్నర లక్షల పంట నేలపాలైంది. నాలుగు ఎకరాల్లో పెట్టుబడి రూ.లక్ష 20 వేల అప్పు మిగిలింది. ప్రభుత్వం సర్వేలకు పరిమితం కాకుండా నష్టపోయిన మొక్కజొన్న రైతుల్ని ఆదుకోవాలి. **- కొడగాని నర్సింహ, రైతు రామచంద్రాపురం**

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే

చిల్పూరు: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం లాంటిదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 32 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీఓ మధుసూదన్, ఆర్ఐ వినీత్, చిల్పూరు ఆలయం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌రావు, లావణ్య, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న జమాల్ షరీఫ్

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని జామాతే హింద్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ కాస్మి, న్యాయవాది జమాల్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నమాజ్ అనంతరం జామియా మసీద్, ఏక్ మినార్ మక్కా మసీద్‌లో నిరసన తెలిపారు. మౌలాన షఫీర్, మసీఉర్ రెహిమాన్, మజార్ షరీఫ్, అన్వర్, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని జామా మసీద్‌లో ప్రార్థన అనంతరం నల్ల బ్యాడ్జీలతో ముస్లింలు నిరసన తెలిపారు. మత పెద్దలు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ రమాదేవి

● సీడీపీఓ రమాదేవి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ సీడీపీఓ రమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కొన్నె, కొడవటూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలను ప్రదర్శించి గర్భిణులు, బాలింతలకు వాటిపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మనోహర, కవిత, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలక్ష్మి, రజిని, ఉషారాణి, విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల అభివృద్ధికి నిలయాలు

దేవరుప్పుల: అంగన్‌వాడీ కేంద్రాలు అన్ని వర్గాల ప్రజల పిల్లల అభివృద్ధికి నిలయాలు అని ఐసీడీఎస్ కొడకండ్ల సీడీపీఓ సత్యవతి అన్నారు. మండలంలోని పెద్దమడూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు పురస్కరించుకొని పౌష్టికాహార పదార్థాలపై ప్రదర్శన చేపట్టి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, పల్లెదవాఖానా వైద్యురాలు శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే ఆశయ సాధనకు పాటుపడాలి



జనగామ రూరల్: జ్యోతిబా పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



జనగామ రూరల్: పట్టణంలో..



జఫర్‌గఢ్: ఆదర్శ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సంఘసంస్కర్తగా, సామాజికవేత్తగా సమసమాజస్థాపన కోసం అహర్నిశలు కృషి చేసిన జ్యోతిబా పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని అన్నారు. పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రఘునాథపల్లిలో..



జనగామ రూరల్: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

'తప్పుడు ప్రసారాలపై చర్యలు తీసుకోవాలి'

కొడకండ్ల/పాలకుర్తిటౌన్/దేవరుప్పుల: నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతలు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలపై తప్పుడు ప్రసారాలు చేస్తున్న న్యూస్ చానల్, యూట్యూబ్ ఛానల్స్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పలు మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలో ఎస్సైలకు వారు ఫిర్యాదు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు సురేష్‌నాయక్, వెంకన్న, మాదాసు హరీష్‌గౌడ్, రాజేష్‌నాయక్, యాకేష్‌యాదవ్, ఇనుముల నాగరాజు, యూత్ నాయకులు మాసంపెల్లి సాత్విక్, కమ్మగాని మహేష్ ఉన్నారు.

ధాన్యం కుప్పపై సీఎం, ఎమ్మెల్యే పేర్లు



పాలకుర్తి: ధాన్యం కుప్పపై సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్విరెడ్డి పేర్లు రాసి ఓ రైతు తన అభిమానాన్ని చాటుకున్నాడు. శుక్రవారం తొర్రూరు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యం కుప్పపై రైతు గాదరి రామయ్య సీఎం, ఎమ్మెల్యే పేర్లు రాయడంతో పలువురు రైతులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి: రైతాంగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యవైఖరిని వీడి తక్షణమే పరిష్కరించాలని అఖిలభారత రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు లింగనబోయిన కుమారస్వామి డిమాండ్ చేశారు. అఖిలభారత రైతు సంఘం 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘన్‌పూర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండావిష్కరణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మొదటి నుంచి ఆల్ ఇండియా కిసాన్‌సభ పనిచేస్తుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు, విత్తనాలు, ఎరువులు, సాగు నీరు తదితర సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రైతాంగ సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో వారాల లింగయ్య, కాసు ప్రభాకర్, మంద మొగిలి, రాజు, వెంకటనారాయణ, యాదగిరి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తిలో నిర్వహించిన అఖిలభారత రైతుసంఘం ఆవిర్భావ దినోత్సవంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సారయ్య హాజరై జెండాను ఆవిష్కరించారు. బెల్లి సంపత్, భాస్కర్, రాజు, శ్రీనివాస్, సోమయ్య, పోన్ను సోమనర్సయ్య, జ్యోతి సోమనాథం పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జనగామ రూరల్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన పట్టణంలో చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి జేఏసీ కన్వీనర్ పిట్టల సురేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. బంద్‌లో విద్యార్థి సంఘాలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. టీజీవీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కౌశిక్, పట్టణ అధ్యక్షుడు అజయ్, సాయి, ఈశ్వర్, అర్జున్, కార్తీక్, సిద్ధు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



నర్మెట: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపేందర్‌రెడ్డి



చిల్పూరులో.. ఏఓ నసీరుద్దీన్



బచ్చన్నపేటలో.. శ్వేత

నర్మెట/తరిగొప్పుల: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను ఆశ్రయించ వద్దని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్, గ్రేటర్ హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంతో పాటు కన్నెబోయినగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకమని, ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నక్కల గట్టయ్య, ఆర్ఐ సింగారపు సాయిబాబ, ఏఈఓ సుంకరి జగదీష్, సీఈఓ కొన్నె వెంకటయ్య, డైరెక్టర్లు అర్జుల సుధాకర్ రెడ్డి, చంద్రమౌళి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తరిగొప్పులమండలంలోని పలు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైస్ చైర్మన్ నక్కల గట్టయ్య, డైరెక్టర్లు అర్జుల సుధాకర్ రెడ్డి, కిషన్‌గౌడ్, రమేష్, రాజయ్య, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఐకేపీ ఏపీఎం కె.కుమారస్వామి అన్నారు. మండలంలోని ఇప్పగూడెం, శివునిపల్లి, నమిలిగొండ, పాంనూర్, తాటికొండ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఏఓ చంద్రన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్, మాజీ సర్పంచ్ కొంతం శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

కొడకండ్ల/దేవరుప్పుల: ధాన్యానికి మద్దతు ధర కల్పించడంతో పాటు సన్న రకంనకు రూ.500 బోనస్ ఇస్తూ రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని మార్కెట్ చైర్మన్ నల్ల ఆండాలు అన్నారు. కొడకండ్ల మండలంలోని ఏడునూతుల, దేవరుప్పుల మండలంలోని చిన్నమడూరులో, ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రమోహన్, ఏపీఎం సత్యనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణమూర్తి, సీఈఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

బచ్చన్నపేట: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. మండలంలోని చిన్నరామన్‌చర్ల, బచ్చన్నపేట, నారాయణపురం, బసిరెడ్డిపల్లి, ఆలింపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. తహసీల్దార్ ప్రకాశ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

పాలకుర్తి: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని చిట్యాల ఐలమ్మ మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గోనె మైసులు, జనగామ డివిజన్ కోఆపరేటివ్ వై.రాజేందర్ రెడ్డి, శరత్ చంద్ర, మైసిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిల్పూరు: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ ఏఓ నసీరుద్దీన్ ప్రారంభించారు. ఐకేపీ ఇన్‌చార్జి ఏపీయం కవిత, కనకచంద్రం, ఎంపీఓ మధుసూదన్, ఏఈఓలు యాకూబ్, వినయ్‌కుమార్, నర్సింహులు పాల్గొన్నారు.

మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్

● మాజీ మంత్రి దయాకర్‌రావు



కొడకండ్ల: మాట్లాడుతున్న దయాకర్‌రావు

కొడకండ్ల: మోసాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిందె రామోజీ అధ్యక్షతన నిర్వహించిన రజతోత్సవ సన్నాహక సమావేశంలో దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని దయాకర్‌రావు కోరారు. ఈ సమావేశంలో పేరం రాము, వెంకటేశ్వర్‌రావు, అభిమన్‌గాంధీ, జ్యోతి, సోమరాములు, మంగ్యానాయక్, సతీష్‌గౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ వాల్ పోస్టర్‌ను మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల కళింగ రాజు, మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, మాజీ రైతు కోఆర్డినేటర్ బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంట పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న రాంబాబు

రఘునాథపల్లి: మంగళిబండతండాలో వడగండ్లతో దెబ్బతిన్న వరి పంటను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డిలు పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆకస్మాత్తుగా వచ్చిన వడగండ్లతో చేతికందిన వరి పంట నేలపాలైందని తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు, జగదీష్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈదురు గాలులతో కురిసిన వడగండ్ల కారణంగా మంగళిబండతండాతో పాటు కోమళ్ల, ఖిలాషాపూర్, ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్‌లో వరి పంటకు నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని వారు పేర్కొన్నారు. రవిగౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనగామ రూరల్: రెండో శనివారం సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ సౌమ్య శుక్రవారం తెలిపారు. పట్టణంలోని సాయినగర్, హౌసింగ్ బోర్డ్, కురుమవాడ, నెహ్రూ పార్క్, సెయింట్ పాల్ స్కూల్ వెనుక వీధి, కామాక్షి ఫంక్షన్ హాల్ ఎదురుగా ఇందిరమ్మ కాలనీ ఏరియాలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పనున్నందున వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బైక్ ర్యాలీ

జనగామ రూరల్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని ధర్మకంచ కమ్యూనిటీ హాల్ నుంచి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ సుగుణకర్ రాజు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పార్నంది వెంకటస్వామి, డాక్టర్ బొల్లేపల్లి కృష్ణ, కందుకూరి ప్రభాకర్, మల్లిగారి రాజు, బొట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై చేస్తున్న కుట్రలను తిప్పికొడుతూ రక్షించుకునే భాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉన్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తమ్మడపల్లి గ్రామంలో జై బాపు, జైభీమ్ జై సంవిధాన్ కార్యాక్రమంలో భాగంగా ర్యాలీ, పాదయాత్ర నిర్వహించారు.

ఈదురుగాలులకు విరిగిన చెట్లు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో గురువారం అర్ధరాత్రి వీచిన ఈదురుగాలులకు రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. తాటికొండ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చే రోడ్డుపై రెండు చెట్లు అడ్డంగా పడటంతో శుక్రవారం ఉదయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా, విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఎదునూరి సత్యనారాయణ వెంటనే స్పందించి పంచాయతీ సిబ్బందితో చెట్లను తొలగింపచేశారు.

సంక్షిప్త సమాచారం

మైనర్లకు కౌన్సెలింగ్

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న స్థానిక ఎస్సై యాకుబ్ హుస్సేన్‌కు ఒకే బైకుపై నలుగురు మైనర్లు ప్రయాణిస్తు కనిపించారు. కాగా, వారిని ఎస్సై ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. బైక్ పై మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని, మైనర్లకు తల్లిదండ్రులు బైక్‌లు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

నర్మెట: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు పగిడిపల్లి దామోదర్, రావుల రాంరెడ్డి అన్నారు. మాన్‌సింగ్‌తండాలో శుక్రవారం ముందస్తు బడిబాటను విద్యార్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి తల్లితండ్రులను కోరారు. నాణ్యమైన విద్యతోపాటు, దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను వివరించారు. మన ఊరిలోని మన బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పెంచిన ధరలు తగ్గించాలి

రఘునాథపల్లి: పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నిడిగొండ, శ్రీమన్నారాయణపురంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కట్టెల పొయ్యిపై వంటలు చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నాయకులు ఎల్లేష్, రామనర్సయ్య, ఐలయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

'జనసేనానిని విమర్శించే అర్హత కవితకు లేదు'

స్టేషన్‌ఘన్‌పూర్: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎంతమాత్రం లేదని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన పదవిని పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న పవన్‌కల్యాణ్‌ను లిక్కర్ స్కామ్‌లో ఊచలు లెక్కపెట్టిన కవిత విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి

బచ్చన్నపేట: మహిళలు పొదుపును అలవాటు చేసుకుంటే ఎవ్వరిపై ఆధారపడకుండా జీవించవచ్చని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. శుక్రవారం సాల్వాపూర్ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు సంఘాల్లో సభ్యత్వం పొంది బ్యాంకుల ద్వారా జీవనోపాధికి రుణాలను తీసుకోవాలన్నారు. అలాగే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన మహిళా సభ్యులు బ్యాంకు ద్వారా రూ.లక్ష రుణం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీసీ నర్సింహులు, వీఓ అధ్యక్షురాలు పడాల పద్మ, వీఓఏ రేణుక, మహిళలు పాల్గొన్నారు.